క్లుప్తంగా

పంట కాలువకు మరమ్మతులు ప్రారంభం



పొన్నూరు మండలంలోని ములుకుదురు గ్రామ శివారులోని భద్రయ్య కాలువ మరమ్మతు పనులను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ బుధవారం ప్రారంభించారు. సాగు నీటి కాలువలకు త్వరితగతిన మరమ్మతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు బండ్ల మూడి బాబురావు, చిన్న ఇటికింపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

డయేరియా కేసుల సమాచారం ఇవ్వాలి

పొన్నూరు పురపాలిక సంఘం పరిధిలో పైపు లైను లీకుల కారణంగా వచ్చే కలుషిత నీటి ద్వారా సంక్రమించే డయేరియా కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. పైప్‌లైను లీకులు ఉంటే తెలియజేయాలని పేర్కొన్నారు. వ్యాధులు, వెక్టార్ బోర్న్ వ్యాధులు, వైరల్ జ్వరాలు, డెంగీ, మలేరియా, స్వైన్‌ఫ్లూ, ఇతర వ్యాధులు సంక్రమించిన వెంటనే ఫోన్ నెంబర్ 08643-247737కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి దేవాలయంలో తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఎంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్, ఆలయ కమిటీ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరగ్గా, ఉదయం విఘ్నేశ్వరుడికి, అయ్యప్పస్వామికి విశేష అభిషేకార్చనలు జరిగాయి. అనంతరం శాంతి హోమం, మహా పూర్ణాహుతి, శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామికి తిరు వీధుల్లో నగరోత్సవం, మహా పుష్పాభిషేకంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందించగా, భారీగా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

గిరిజన విద్యార్థులు చదువులో రాణించాలి



నెహ్రూనగర్: సమాజంలో గిరిజన విద్యార్థులు చదువులోని రాణించాల్సిన అవసరం ఎంతైన ఉందని మోక్షిత్ రుషిక ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మహిళా ప్రాంగణంలోని గిరిజన వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్ బుక్స్, జామెంట్రీ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అటవీ ప్రాంతాన్ని వదిలి ఇక్కడికి వచ్చి చదువుకోవడం చాలా హర్షణీయమని చెప్పారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ శిరీష, హాస్టల్ వార్డెన్ శిల్ప, గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావతు పాండునాయక్, జిల్లా అధ్యక్షులు అంజినాయక్ పాల్గొన్నారు.

మందులు కొరత లేకుండా చూడాలి

ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు బీజేపీ వినతి



గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు కొరత లేకుండా అధికారులు దృష్టి సారించాలని బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. బుధవారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్యం అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సామాన్యులకు ఉచిత వైద్యం అందించే ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు కొరత లేకుండా అధికారులు దృష్టి సారించాలని కోరినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ సీనియర్ నాయకులు విజయభాస్కర రెడ్డి, జాతీయ నేచురోపతీ సభ్యురాలు బొల్లాప్రగడ శ్రీదేవి ఉన్నారు.

భవనం శిథిలం.. సర్వం నిర్లక్ష్యం!



తహసీల్దార్ కార్యాలయం

- కాలం తీరిన ప్రభుత్వ భవనాలు
- ప్రమాదకరంగా పలు కార్యాలయాలు
- తాత్కాలిక మరమ్మతులకే పరిమితం
- చోద్యం చూస్తున్న అధికారులు

పొన్నూరు పొన్నూరు పట్టణంలో వందేళ్ల క్రితం నిర్మితమైన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. నిత్యం పైకప్పు పెచ్చులూడుతూ ప్రమాదకరంగా మారాయి. ఎన్ని ప్రభుత్వాలు మారినా వాటి ఊసే పట్టడంలేదు. వాటిలో విధులు నిర్వహించే అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తూ కాలం వెళ్లదీస్తున్నారే కానీ, శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం లేదు. దాదాపు వంద సంవత్సరాల క్రితం నిర్మితమైన ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ ఆ భవనాల్లోనే కొనసాగుతుండటం విచిత్రం. మండల స్థాయి ప్రధాన కార్యాలయాలు కావడంతో నిత్యం అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. విధుల సమయంలో పెచ్చులూడి పడుతుండటంతో అధికారులకు, ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. వర్షాకాలంలో కార్యాలయాలు లీకుల కారణంగా జలమయం అవుతున్నాయి. భవనాలు ప్రమాదకరంగా మారడంతో ప్రజలు లోపలికి వచ్చేందుకు సంకోచిస్తున్నారు. అధికారులు తమ సమస్యను పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా నూతన భవనాల నిర్మాణ ప్రక్రియ కాగితాలకే పరిమితమైంది. శాశ్వత ప్రయోజనం చేకూరడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం ఆ శిథిల భవనాల్లో 18 సెంట్ల విస్తీర్ణంలో తహసీల్దార్ కార్యాలయం, 10 సెంట్లలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. గతంలో ఆ భవనాల్లోనే 10 సెంట్లలో పాత పోలీస్ స్టేషన్ ఉండేది, ప్రస్తుతం వేరే చోట నూతన భవనం ఏర్పాటైంది. 9.5 సెంట్ల విస్తీర్ణంలో ఉండే సబ్ జైలుతో పాటు సబ్ ట్రెజరీ పలు కారణాలతో వేరే ప్రాంతానికి మార్చారు. బ్రిటీష్ కాలంలో ప్రజా ప్రయోజనాల కోసం పట్టణం నడిబొడ్డున నిర్మితమైన ప్రభుత్వ కార్యాలయాలకు ఆదరణ కరవైందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి శిథిల భవనాలను కూల్చివేసి నూతన భవన నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో పై కప్పు దుస్థితి



శిథిలమైన పాత సబ్ ట్రెజరీ కార్యాలయం



వినియోగంలో లేని సబ్ జైలు



శిథిలావస్థకు చేరిన పాత పోలీస్ స్టేషన్ భవనం

'విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

చేబ్రోలు మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలను విద్యార్థులు వాడితే ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతారని పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై కోటేశ్వరరావు అన్నారు. చేబ్రోలులోని సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలు నిర్వహించారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ కే సుచరిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐ వై.కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశలో తెలియక చేసిన తప్పు జీవితాన్ని బలి తీసుకుంటుందన్నారు. డ్రగ్స్ వల్ల క్షణికానందం పొందినా ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సర్వం కోల్పోవలసి ఉంటుందన్నారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించటానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే సుచరిత, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ కే సుధాకర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పొన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. కోటేశ్వరరావు తదితరులు

బడి ఈడు పిల్లలందర్ని పాఠశాలలో చేర్చాలి

రేటూరు(కాకుమాను): బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలోనే ఉండాలని , వారితో పని చేయించటడం చట్టరీత్యా నేరమని ఎంఈఓ -2 విజయ్ భాస్కర్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని రేటూరు ఎస్టీ కాలనీలో విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలను గుర్తించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందన్నారు. ప్రతి చిన్నారికి విద్యను అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.రామకృష్ణ, ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.వీరాస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ-2 విజయ్ భాస్కర్

విలీన గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని శివారు ప్రాంతాలు, విలీన గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు సూచించారు. బుధవారం ఎస్ఈ ఎం.శ్యాం సుందర్ మేయర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైన్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల నిర్వహణలో నగరంతో పాటు నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలు, శివారు ప్రాంతాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.



మేయర్ కావటిని మర్యాదపూర్వకంగా కలిసి బోకే అందజేస్తున్న ఎస్ఈ శ్యాంసుందర్

కార్పొరేటర్‌ను పరామర్శించిన మేయర్

నెహ్రూనగర్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన 11వ డివిజన్ కార్పొరేటర్ అబిద్ బాషాను నగర మేయర్ బుధవారం పొన్నూరు రోడ్డులోని కార్పొరేటర్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు.

నైపుణ్యాలతో ప్రతిభావంతులుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలో అంతర్గతంగా దాగిన నైపుణ్యాలను వెలికితీసి ప్రతిభావంతులుగా ఎదగాలని ప్రభుత్వ మహిళా కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బండి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల విద్యార్థులు ఏఎన్‌యూ ఇటీవల ప్రకటించిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మనస్థానాన్ని ఏర్పరచుకునేందుకు, మన లక్ష్యాలను సాధించేందుకు సహాయపడతాయన్నారు. ఈసందర్భంగా ఓరియెంటల్ హైస్కూల్ విశ్రాంత ప్రిన్సిపాల్ పీవీ నాథ్ జ్ఞాపకార్థం ఆయన పేరుపై స్మారక ప్రోత్సాహక నగదు బహుమతులను ఆయన కుమారుడు, కోడలు రవి, శ్రీలక్ష్మి విద్యార్థులకు అందజేశారు. ఎంబీఏ విభాగం నుంచి పి.అమృతవల్లి, గోపాలదాసు సుమాంజలి, వంగిపురపు యామిని ప్రియ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో పర్వతనేని మేఘన చౌదరి, దండా హరనాథ్ వి.శ్రావ్య నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి.కళ్యాణి, డాక్టర్ గోపి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు చల్లా వైష్ణవి, ఏ బాజీబాబు, సీహెచ్ వేదవతి, మణికంఠ, అనిత పాల్గొన్నారు.



విద్యార్థులతో సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్వీ రమణ

ముగిసిన నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: స్థానిక కృష్ణనగర్ ఒకటో వీధిలోని గోదా పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం నిత్యపూజలు సుదర్శన, మూలమంత్ర హోమం, మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం, తిరుప్పావడసేవ, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరగ్గా, భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ధ్వజావరోహణ, ద్వాదశ ప్రదక్షిణాలు, ఉంజల్‌సేవ తీర్థ ప్రసాద వితరణతో బ్రహ్మోత్సవాలు ముగియగా, ధనకుదరం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

ప్రముఖ నటుడు రాజా తాతయ్యకు ఘన సత్కారం



రాజా తాతయ్యను సత్కరిస్తున్న బివిఆర్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై జై భవాని నాట్యమండలి పూర్వ అధ్యక్షులు, ప్రముఖ నటులు దివంగత బండారుపల్లి వెంకటేశ్వరరావు(బీవీ రావు) వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వి.రావు కళాసేవా పురస్కార సభ జరిగింది. కార్యక్రమానికి ఎంవీఎల్ నరసింహారావు సభ అధ్యక్షత వహించారు. దేవాలయం అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, శ్రీ జై భవాని నాట్యమండలి అధ్యక్షుడు అయితి వాసుదేవశర్మ, ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షులు పిన్నమనేని పాములయ్య, సీనియర్ నటులు ఏవీ శివయ్య, ఆర్కిటెక్ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు. సత్కార గ్రహీతలైన సీనియర్ నటుడు రాజా తాతయ్య(పాలకొల్లు), రంగస్థల నటులు కె.సరిత, ఎస్.మాధవి(హైదరాబాద్)లను బి.వి.రావ్ మెమోరియల్ థియేటర్స్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ది అమెచ్యూర్స్ డ్రమెటిక్ అసోసియేషన్ (చిలకలూరిపేట) ఆధ్వర్యంలో షేక్ షఫీ దర్శకత్వంలో ప్రదర్శించిన ఏడనున్నాడో.. ఎక్కడున్నాడో అనే హాస్యనాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం

కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్

గుంటూరు రూరల్: నైపుణ్యతతో కూడిన విద్య, కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక నైపుణ్యాన్ని ప్రతి విద్యార్థికి నేర్పి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయటం తమ కళాశాల కర్తవ్యమని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర్ రెడ్డి తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ డిప్లొమా సంబంధిత కోర్సులలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. కళాశాల చైర్మన్ కళ్ళం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ, ఉపాధి కల్పన ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ డిప్లొమా విద్యార్థులకు ప్రస్తుత కార్పొరేట్ కంపెనీలలో ఉపాధి అవకాశాలకు అవసరమయ్యే సాంకేతిక విద్యను అందిస్తున్న ఏకైక కళాశాల తమదని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి తదితరులు

డ్రగ్స్ రహిత సమాజానికి యువత పాత్ర కీలకం



ర్యాలీని ప్రారంభిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

గుంటూరు రూరల్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములవ్వాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలను గుర్తుంచుకోవాలని సూచించారు. వాటిని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొంటున్న చర్యలను వివరించారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ కళాశాల పరిసరాల్లో ర్యాలీ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వాడకానికి విద్యార్థులు, యువత దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌జీ కంపెనీ ఓలెడ్ సీ4 టీవీ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: వినియోగదారుల సౌకర్యార్థం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎల్‌జీ కంపెనీ నూతనంగా ఉత్పత్తి చేసిన ఓలెడ్ సీ4 (4 సిరీస్) టీవీని బుధవారం ఆవిష్కరించారు. నగర శివారులోని గోరంట్ల ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఉన్న శ్రీ మట్టుపల్లి అప్లయిన్సెస్ షోరూంలో జరిగిన ఈ కార్యక్రమంలో షోరూం అధినేత మట్టుపల్లి సాయిరాం చేతుల మీదుగా నూతన టీవీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వినియోగదారులకు ఉత్తమ వస్తువులను అందిస్తున్నామన్నారు. ఎల్‌జీ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ పరుచూరి కిషోర్‌బాబు మాట్లాడుతూ తమ ఉత్పత్తి టీవీ రంగంలోనే సరికొత్త విప్లవాత్మక మార్పులను తీసుకొస్తుందన్నారు. ఈ టీవీలు ఏఐ ఆధారంగా పనిచేస్తాయని వివరించారు. డాల్బి విషన్, డాల్బి అటామస్ లాంటి ఆడియో, వీడియో విభాగాలతో సరికొత్త అనుభూతిని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎల్‌జీ ఏరియా మేనేజర్ మహర్‌జీ, మార్కెటింగ్ మేనేజర్ హేమంత్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



టీవీని ఆవిష్కరిస్తున్న సాయిరాం తదితరులు

ప్రోత్సాహంతో అద్భుతాలు ఆవిష్కృతం

చిన్నారి నర్తకి గ్రీష్మశ్రీ సత్కార సభలో పాఠశాల విద్య ఆర్‌జేడీ పి.లింగేశ్వరరెడ్డి

తెనాలి: అరవిందుల సందేశాలు ప్రపంచానికి మార్గదర్శకాలని, విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ పి.లింగేశ్వరరెడ్డి అన్నారు. ఆధునిక విద్య ఆధ్యాత్మిక, నైతిక విలువలతో సమ్మిళితంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పాఠశాలల్లో పిల్లల్ని ఏ విధంగా తీసుకెళుతున్నామనే అంశంపై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని చెబుతూ, విద్యార్థుల్లో సృజనను పెంచటంలో విద్యా సంస్థలు కృషి చేయాలని సూచించారు. పట్టణ నాజరుపేటలోని శ్రీ అరవింద విద్యాకేంద్రం నాలుగో తరగతి విద్యార్థిని, బాలనర్తకి గ్రీష్మశ్రీ మూడు రాష్ట్రాల గవర్నర్ల ప్రశంసలు పొందిన సందర్భంగా బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. శ్రీ అరవింద విద్యాకేంద్రంలో ఏర్పాటైన సభకు సంస్థ డైరెక్టర్ కొండపనేని సంపూర్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రీష్మశ్రీ నృత్యాభినయాన్ని ప్రత్యేకంగా అభినందించారు. పిల్లలకు క్రమం తప్పని సాధన, ప్రోత్సాహం ఉంటే ఏదైనా సాధిస్తారనేందుకు గ్రీష్మశ్రీ నిదర్శనమన్నారు. ప్రోత్సహించిన తల్లి దండ్రులు, శిక్షణ నిచ్చిన నృత్య గురువుకు అభినందనలు తెలియజేశారు. విశిష్ట అతిథి, సినీదర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ నాట్యంలో చక్కని ప్రతిభను చాటుతున్న గ్రీష్మశ్రీ భవిష్యత్ ఉన్నతం కాగలదని చెప్పారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో తగిన ప్రోత్సాహం ఉంటే ఎదగొచ్చని అభిప్రాయపడ్డారు. అందుకు సహకారం ఉంటుందన్నారు. అధ్యక్షత వహించిన డైరెక్టర్ సంపూర్ణ మాట్లాడుతూ శ్రీ మాతారవిందుల అంతరాత్మ విద్యకు ప్రాధాన్యత నిస్తున్నట్టు చెప్పారు. తెనాలి మండల విద్యాశాఖ అధికారులు డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, జయంత్‌బాబు గ్రీష్మశ్రీని అభినందించారు. తొలుత 'భరత వేదమున' పాటకు గ్రీష్మశ్రీ చక్కని నృత్యాభినయం చేశారు. అనంతరం ఆర్‌జేడీ, దిలీప్‌రాజా, సంపూర్ణ ఆ చిన్నారిని సత్కరించారు. రోటరీ క్లబ్ ప్రతినిధి ఈదర వెంకట పూర్ణచంద్, సినీనటులు వేమూరి విజయభాస్కర్, మన్నే సత్యనారాయణ, వెంకీ రావణ్‌లు గ్రీష్మశ్రీని అభినందించారు. తొలుత తన నృత్యగురువు నిర్మలారమేష్‌ను సత్కరించారు. గ్రీష్మశ్రీ తల్లిదండ్రులు సెవ్వా కృష్ణారెడ్డి, అరుణకుమారి, విద్యాకేంద్రం కార్యదర్శి యడ్ల మోహన్‌రావు, ఉపాధ్యాయినిలు నందిపాటి శివకుమారి, ఆర్.నిర్మలకుమారి, ఎస్‌వై బాషా, కె.సంధ్య పాల్గొన్నారు.



గ్రీష్మశ్రీని సత్కరిస్తున్న లింగేశ్వరరెడ్డి, దిలీప్‌రాజా, సంపూర్ణ

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి నాణ్యమైన విద్యనందించాలని గుంటూరు తూర్పు ఎంఈఓ-2 నాగేంద్రమ్మ పేర్కొన్నారు. వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. పిల్లలను బడికి పంపని తల్లిదండ్రులను కలిసి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు కృషి చేయాలని అన్నారు. వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.కోటి 20 లక్షలు మంజూరు చేసిందని అన్నారు. ప్రత్యేకంగా బాలికల విద్యాభివృద్ధికి ఈ ప్రాంతంలో ఉన్నత పాఠశాల అందుబాటులో ఉందని చెప్పారు.

అర్బన్ బ్యాంక్‌లో పారదర్శకంగా లావాదేవీలు

కొరిటిపాడు(గుంటూరు): ఖాతాదారుల సహకారంతోనే అర్బన్ బ్యాంక్ కార్యకలాపాలు జరుగుతాయి తప్ప, రాజకీయ, ప్రభుత్వ జోక్యం ఉండబోదని ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. స్థానిక బ్రాడీపేటలోని బ్యాంక్ పరిపాలన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బ్యాంక్ స్థాపించి 74 ఏళ్లు నిండి 75వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం జరిగిందన్నారు. త్వరలో గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది చివరి నాటికి రూ.1000 కోట్ల వ్యాపార లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కరోనా సమయంలో వ్యాపారం సక్రమంగా జరగకపోయినా కూడా అడ్వాన్సులు, డిపాజిట్స్ పెంచగలిగామని వెల్లడించారు. అర్బన్ బ్యాంక్‌కు 13 బ్రాంచ్‌లు ఉన్నాయని చెప్పారు. రాజకీయ పార్టీల పేరుతో మాపై బురద జల్లేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, బ్యాంక్‌లో ఎటువంటి తప్పులు జరిగినా చైర్మన్ పదవి నుంచి తప్పుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్ మర్రెడ్డి బసివిరెడ్డి, బ్యాంక్ సీఈఓ ఎన్.సంజీవరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.